సర్వమత సమ్మేళనం


రంజాన్‌కు సిద్ధమైన కాప్రా ఈద్గా

- కాప్రా ఈద్గా చారిత్రాత్మకం..
- వెల్లివిరుస్తోన్న మతసామరస్యం
- కాప్రా ఈద్గాకు 410 ఏళ్లకుపైగా చరిత్ర
- 1610 కుతుబ్‌షాహీల పాలనలో నిర్మాణం
- 2004లో చరిత్రను కాపాడుకుంటూ పునర్నిర్మాణం
- చందాసాబ్ నుంచి బద్రోద్దీన్ వరకు
- రంజాన్‌కు ముస్తాబైన కాప్రా ఈద్గా

కాప్రా: సర్వమత సమ్మేళనం, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది చారిత్రాత్మకత కలిగిన కాప్రా ఈద్గా. ఏ పండగ వచ్చినా ఇక్కడ మతసామరస్యం వెల్లివిరుస్తోంది. రంజాన్ వచ్చిందంటే కాప్రా ఈద్గాలో పెద్ద ఎత్తున ముస్లింలు ప్రార్థనలు చేస్తుంటారు. ఈద్గాలో ముస్లింల పండగలే కాదు.. హిందువుల పండగలకు సంబంధించిన కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. రంజాన్, బక్రీద్ పండగలు వచ్చాయంటే చాలు హిందూ, ముస్లిం అని తేడా ఉండదు. మతాలకతీతంగా మనుషులంతా ఒక్కటిగా కనిపిస్తారు ఈ కాప్రా ఈద్గాలో. కుతుబ్‌షాహీల పాలనలో నిర్మాణానికి పురుడుపోసుకున్న కాప్రా ఈద్గా 410 ఏళ్ల క్రితం నాటి చరిత్ర కలిగింది. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ ప్రార్థనలు కొనసాగుతూనే ఉన్నాయి.


కాప్రా ఈద్గాలో ప్రార్థనల్లో హోంమంత్రి మహమూద్ అలీ(ఫైల్)

చందాసాబ్ నుంచి బద్రోద్దీన్ వరకు..

1610లో అప్పటి మత గురువుగా ఉన్న చందాసాబ్ కాప్రా ఈద్గాను నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. నిర్మాణ అనంతరం నిర్వహణ బాధ్యతలు కూడా చూసుకున్న చందాసాబ్ ఆ తరువాత ఆ బాధ్యతలను తన కొడుకు షేక్ హుస్సేన్‌కు అప్పగించారు. ఆయన తరువాత గౌసియా, ఆ తరువాత సలీం, మహ్మద్ హయాద్, మహ్మద్ ఖాజా సులేమాన్, ఖాజా మొయినుద్దీన్ ఇలా ఎన్నో ఏళ్లుగా ఒక్కొక్కరు నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఈద్గా బాధ్యతలు ఎం.కె.బద్రోద్దీన్ తన భుజానికెత్తుకున్నారు. చందాసాబ్ నుంచి బద్రోద్దీన్ వరకు ఇక్కడ కుల, మతాలకతీతంగా కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి.

2004లో పునర్నిర్మాణం..

పురాతన చరిత్ర కలిగిన కాప్రా ఈద్గా రానురాను శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మించేందుకు పూనుకున్నారు. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.కె.బద్రోద్దీన్ నాయకత్వంలో 2004లో ప్రత్యేక కమిటీ వేసి పునర్‌నిర్మించి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు.

అన్ని కార్యక్రమాలకు నిలయం..

కాప్రా ఈద్గా అన్ని కార్యక్రమాలకు నిలయంగా మారి అందరికీ సేవలు అందిస్తోంది. ఇక్కడ ముస్లిం పండగలే కాదు హిందువుల పండగలకు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. గణేష్ ఉత్సవాల సమయంలో, అయ్యప్ప మాలధారణ సమయంలో కార్యక్రమాలు చేస్తుంటారు. ఇవే కాకుండా శిక్షణ కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు ఈద్గా ఆవరణలో చేస్తుంటారు.

రంజాన్‌లో ప్రత్యేకం..

రంజాన్ వేళ కాప్రా ఈద్గా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇఫ్తార్ విందులతో ఈ ప్రాంతం సందడిగా మారుతోంది. రంజాన్ పర్వదినం రోజున కాప్రా ఈద్గాకు ఇతర దూర ప్రాంతాల నుంచి ఇక్కడి ప్రత్యేక ప్రార్థనల కోసం వస్తుంటారు. హిందువులు, ముస్లింలు కలిసి ఇక్కడ ప్రార్థనలు చేసి, ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకుంటారు. రంజాన్ పర్వదినం రోజున ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనల కోసం కాప్రా ఈద్గా వద్ద కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


కాప్రా ఈద్గాలో సేవా కార్యక్రమాలు(ఫైల్)

ఐక్యంగా ముందుకు..



కులం కాదు, మతం కాదు.. మనమంతా మనుషులం. అందరం ఐక్యంగా సోదరభావంతో ఉండాలన్నదే నా ఆకాంక్ష. మేం అన్ని కార్యక్రమాలు చేస్తాం.. అన్ని పండగలు కలిసిమెలిసి జరుపుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతున్నాం. రంజాన్, బక్రీద్ సమయంలో హిందూ, ముస్లిం తేడా లేకుండా కాప్రా ఈద్గాలో అందరం కలిసి ప్రార్థనలు చేస్తాం. ఎన్నో ఏళ్ల నుంచి కాప్రా ఈద్గాలో ప్రార్థనలు కొనసాగుతున్నాయి. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన చారిత్రాత్మకమైన ఈద్గా కాప్రాలో ఉండటం గర్వంగా ఉంది. అందులో దానికి ప్రస్తుతం నేను బాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. **- ఎం.కె.బద్రోద్దీన్, కాప్రా ఈద్గా కమిటీ చైర్మన్**

క్లుప్తంగా...

ఈద్గాలో వజూఖాన్ నిర్మాణం

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట ఈద్గాలో ముస్లింకు ఇచ్చిన మాట ప్రకారం తన సొంత డబ్బులతో వజూఖాన్ ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. అదేవిధంగా వాటర్ ట్యాంక్, షెడ్డును కూడా వేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు గఫూర్ ఫారూఖ్, షేక్ రఫిక్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, స్థానిక నేతలు దాసరి కర్ణ, అంజి, శ్రీరామ్ సత్యనారయణ, శివ, కృష్ణ, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మోజంలకు రంజాన్ తోఫాలు


ఇమామ్‌లకు రంజాన్ తోఫాలను అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గంలోని 72 మసీదులకు చెందిన ఇమామ్, మోజంలకు 300 మందికి రంజాన్ తోఫాలతో పాటు టైలరింగ్ ఖర్చులను ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్, కటార్ల భాస్కర్, మహేష్‌గౌడ్, ముత్యంరెడ్డి, అంజి, ఖదీర్, జాకీర్, రఫీక్, గఫూర్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చివరి శుక్రవారం ప్రార్థనలు

గౌతంనగర్: మల్కాజిగిరి జోన్ పరిధిలో అన్ని మసీద్‌లలో రంజాన్ మాసం చివరి శుక్రవారం ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం, నేరేడ్‌మెట్, గౌతంనగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని మసీద్‌లలో ముస్లింలు 'అల్‌విదా జుమ్మ' ప్రార్థనలు నిర్వహించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి


ఏఈకి వినతి పత్రం అందజేస్తున్న గుర్రాల వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: 24వ డివిజన్ పరిధిలో వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల వెంకటేశ్‌యాదవ్ శుక్రవారం విద్యుత్ ఏఈకు వినతి పత్రం అందజేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

దొంగతనాల పట్ల జాగ్రత్త

మల్లాపూర్: నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్కూల్ వ్యాన్ డ్రైవర్లతో సైబర్ క్రైమ్ నేరాలు, వాహనాల దొంగతనాలపై నాచారం డీఎస్‌ఐ నాగరాజు అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన వారు వాహనాలను, సైలెన్సర్‌లను దొంగిలిస్తున్నారని పేర్కొన్నారు. వాహనాలు పార్కింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ ఆటో మోటార్ రవాణా రంగం రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, స్కూల్ వ్యాన్ సంఘం అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, పాండునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికుమార్, కుమార్, గజేంద్రరావు, శాతం రమేస్, రాజు, రాకేష్, సతీష్, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

నాగదేవత ఆలయంలో మహాభిషేకం



ఉప్పల్: ఉప్పల్ వెలుగుట్టలోని నాగదేవత రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చి మహాభిషేక పూజలు నిర్వహించారు. గత నెలలో ఇదే ఆలయంలో నాగదేవత విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. అనంతరం 41 రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక మహిళలు ఆలయానికి తరలివచ్చి విగ్రహానికి మహాభిషేకాలు నిర్వహించారు.

ప్రతి విద్యార్థి ప్లేస్‌మెంట్‌తో బయటకు అడుగుపెట్టాలి


సక్సెస్ మీట్‌లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: సీఎంఆర్ గ్రూప్స్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు తమ చదువు పూర్తయ్యే నాటికి ప్లేస్‌మెంట్‌తో బయటకు అడుగు పెట్టాలని, అందుకు తమ యాజమాన్యం నిత్యం కృషి చేస్తోందని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్ రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ కళాశాలలో శుక్రవారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఇప్పటి వరకు సీఎంఆర్‌టీసీ కళాశాలలో చదివిన 600 మందికిపైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ప్రతి విద్యార్థి బాగా చదివి మంచి ఉద్యోగం పొందేందుకు ఎంత ఖర్చయినా సరే అన్ని వసతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, డీన్ దర్మోజీరావు, సృజన్ అలీబేగ్, అశులోష్ సక్సెన, దుర్గాప్రసాద్‌రెడ్డి, మాధవరావు, హిమబిందు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలి


మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

కీసర: కాంగ్రెస్ హయాంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తే బీఆర్‌ఎస్ పాలనలో అనర్హులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తొటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శుక్రవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో పంపిణీ చేయకుండా ఉన్న ఇళ్లను నిరుపేదలకు అందజేయాలని ఆయన అన్నారు. మున్సిపల్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఈగ శ్వేతరాజు ఆధ్వర్యంలో రెండో రోజు కొనసాగిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించే వరకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్నామన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోగుల సరితావెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్

శామీర్‌పేట్: మహిళలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం శామీర్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మేడ్చల్ జిల్లా వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభం కానుందని, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, బస్తీ దవాఖానాల్లో ప్రతి మంగళవారం 57 ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇక నుంచి మహిళల ఆరోగ్య సమస్యలన్నింటికీ వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. కమిషన్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సూచనలు పాటించాలని సూచించారు.

సమస్యలను పరిష్కరిస్తాం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం పబ్లిక్ ఇంటరాక్షన్ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్ ఎంటమాలజీ అధికారులు సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, విద్యుత్, వీధి దీపాలు, పవర్ బోర్లు, కమ్యూనిటీ హాల్ తదితర సమస్యలను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ డీఈ నాగమణి, జలమండలి మేనేజర్ విద్యుత్ ఏఈ రాములు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు మహేందర్, కిషన్, భిక్షపతితో పాటు స్థానిక సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి ఉపేందర్, కోశాధికారి జి.నర్సింగరావు, సలహాదారు కొట్టాల బాల్‌రాజ్, ప్రదీప్ రాజ్, బాలకృష్ణగౌడ్, రాము, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బొడ్రాయి వార్షికోత్సవం

మల్లాపూర్: నాచారం గ్రామ బొడ్రాయి పంచమ వార్షికోత్సవం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గ్రామ పెద్ద పంతులు వేదాంత నర్సింహమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండాల సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీరామ్ సత్యనారాయణ, రాగిరి మోహన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రమణారెడ్డి పాండురంగం, క్రిష్టయ్య, నర్సింగ్‌రావు, యాదగిరి, నవీన్‌కుమార్, శివకుమార్, దాసరి కర్ణ, గోపీ, నాగరాజ్, జంగం అశోక్, వాసు ప్రభాకర్, ఇప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం


ఈశ్వరమ్మ(ఫైల్)


పూర్వజ, హారిణి(ఫైల్)

బోడుప్పల్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తల్లీ కూతుళ్లు కనిపించకుండా పోయిన ఘటన శుక్రవారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ వివరాల ప్రకారం మేడిపల్లి పీఅండ్‌టీ కాలనీలో నివసించే డి.వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ(37) భార్యాభర్తలు. ఈశ్వరమ్మ గృహిణి. వీరికి పూర్వజ(19), హరిణి(18) కూతుళ్లు. ప్రస్తుతం వీరు చదువుకుంటున్నారు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా ఈశ్వరమ్మ, ఇద్దరు కుమార్తెలు వెళ్లిపోయారు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో వెంకటేశ్వర్లు మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

మంత్రి చామకూర మల్లారెడ్డి


పార్కును ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని 2వ డివిజన్‌లో ఉన్న ఎస్సీ వైకుంఠధామంలో రూ.32 లక్షలతో చేపట్టిన పనులను, అలాగే శివసాయినగర్‌లోని పబ్లిక్ పార్కు ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పీర్జాదిగూడలో అన్ని మతాలకు ఒకే దగ్గర వైకుంఠధామాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. స్నానాల గదులు, ప్రత్యేక నల్లాలు, దహన సంస్కారాలకు ప్రత్యేక నిర్మాణాలు, పచ్చని పూల మొక్కలతో సుందరీకరించినట్లు వెల్లడించారు. అలాగే వేసవి కాలంలో కాలనీల ప్రజలు సేద తీరేందుకు పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా పిల్లలు పెద్దలు పార్కుల్లోకి వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడుపుతున్నారన్నారు. కార్యక్రమంలో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు కొడే పోచయ్య, సుభాష్‌నాయక్, బొడిగె స్వాతి కృష్ణగౌడ్, అనంత్‌రెడ్డి, హరిశంకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, బచ్చరాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వేగవంతం చేస్తాం

ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పంకజ, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఈస్ట్ జోనల్ కమిషనర్ పంకజ పరిశీలించారు. మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద మహాత్ముల విగ్రహాల ముందు రోడ్డు వెడల్పు, సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. థీమ్‌పార్క్‌లో మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తిచేసి పార్కును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆమె ఆదేశించారు. రజక సంఘం, దోభీఘాట్‌లో సీసీ రోడ్డు, అసంపూర్తిగా ఉన్న ప్రహరి, షెడ్డు ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు. బీరప్పగడ్డ, జేఎస్‌ఎస్‌యూఆర్‌ఎం, శివహోటల్ వరకు రోడ్డు వెడల్పు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించాలని కమిషనర్‌తో పేర్కొన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ మాట్లాడుతూ.. పెండింగ్ పనులను వేగవంతం చేస్తామన్నారు. కాప్రా సర్కిల్ డీసీ శంకర్, ఈఈ హరిలాల్, ప్రాజెక్ట్ ఇంజినీర్ డీఈ రూప, ఏఈ స్రవంతి, స్థానిక నేతలు కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీ శివకుమార్, వాసుగౌడ్, రాజు, పద్మారెడ్డి, పాండు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయాదవ్, శ్రీనివాస్, కిషోర్, శ్రీకాంత్, శ్రవణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


కంటి వెలుగులో పాల్గొన్న మేయర్ సామల బుచ్చిరెడ్డి

బోడుప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 9వ డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కళ్లద్దాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు మోదుగు లావణ్య శేఖర్‌రెడ్డి, సీసా వెంకటేశ్‌గౌడ్, మీసాల కృష్ణ, అబ్దుల్ అలీం, కాలనీవాసులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫాల పంపిణీ

ముస్లింలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రంజాన్ తోఫాలను శుక్రవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లింలు సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. ముస్లింలతో కలిసి ఉపవాస దీక్ష అనంతరం విందులో ఆయన పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


లయోల కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

అల్వాల్: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని లయోల కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. వరల్డ్ ఎర్త్‌డే సందర్భంగా శుక్రవారం అల్వాల్ లయోల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు పరేడ్ నిర్వాహించారు. చెట్లు నరికేయడం, నీటిని కలుషితం చేయడం వలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలను తొలగించాలి

అల్వాల్: రోడ్డు ఆక్రమణలను తొలగించడంతో పాటు వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితకిషోర్ జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని లోటస్ పాండ్ కాలనీలో శుక్రవారం అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ లే అవుట్ ఏర్పాటు సమయంలో సూచించిన విధంగా రోడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉప్పల్‌లో క్రీడా సామాగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలను యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం వేసవి శిక్షణ శిబిరాలకు సంబంధించిన క్రీడా సామాగ్రిని అందజేశారు. క్యారమ్స్, వాలీబాల్, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తుమ్మల దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ శుక్రవారం రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వార్డులో ముస్లింల ఇంటికి వెళ్లి రంజాన్ కానుకలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో విజయ్‌ముదిరాజ్, యశ్వంత్‌యాదవ్, సాయికిరణ్, వార్డు అధ్యక్షుడు సలీం, శాబేగం, కేస్కార్, హబీబ్, జహంగీర్, ఫయూమ్ స్థానికులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబీకులకు ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన కుర్రి కలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మరణించింది. సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ మృతురాలి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు సొంత డబ్బులు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, వార్డు సభ్యులు ఆంజనేయులు, నాయకులు రవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దుర్వాసనపై కాలనీవాసుల ఫిర్యాదు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో జవాసాలకు సమీపంలో ఆరబోసిన వేప గింజల కల్లం కారణంగా దుర్వాసన వెదజల్లుతోందని గోల్డెన్ వ్యాలీ కాలనీవాసులు పంచాయతీలో ఫిర్యాదు చేయగా యజమానికి నోటీసు అందజేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పాలకవర్గం సహాయ పర్యావరణవేత్త మహేశ్‌కు విన్నవించగా స్థలాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ విషయమై మూడు రోజుల్లో నివేదిక అందజేస్తానని అధికారి తెలిపారు. మశ్చేందర్‌రెడ్డి స్థానికులు ఉన్నారు.